

సమావేశంలో మాట్లాడుతున్న బోర్డు ఎస్ఈ శ్రీకాంత్

నీటి వాటాలు ఖరారు


- తుంగభద్రకు 172 టీఎంసీల నీరు రావచ్చు
- మూడురాష్ట్రాల వాటా ప్రకటించిన బోర్డు

బళ్లారి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మూడు రాష్ట్రాల జీవనాడి అయిన తుంగభద్ర జలాశయ నీటి వాటాను అధికారులు ప్రకటించారు. విజయనగర(హొస్పేట్) టీబీ బోర్డు కార్యాలయంలో గురువారం తుంగభద్ర బోర్డు పరిధిలో ఉన్న అనంతపురం, కర్నూలు, కర్ణాటక ఇంజనీర్ల సమావేశం నిర్వహించారు. బోర్డు ఎస్ఈ ఆర్ శ్రీకాంత్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ సమావేశంలో అనంతపురం ఇరిగేషన్ ఎస్ఈ (హెచ్చెల్సీ) ఎస్.రాజశేఖర్, కర్నూలు జిల్లా (ఎల్లెల్సీ) ఎస్ఈ పి. రెడ్డి శేఖర్ రెడ్డి, ఎల్లెల్సీ ఈఈ నీలకంఠారెడ్డి, బోర్డు సెక్రటరీ ఓఆర్‌కే రెడ్డి, ఇతర ఇతర ఇంజనీర్లు పాల్గొన్నారు. బచావత్ అవార్డు ప్రకారం తుంగభద్ర డ్యాంకు 212 నీరు లభ్యం కావాల్సింది. అయితే నీటి లెక్కల ప్రకారం 172 టీఎంసీల డ్యాంకు చేరుతాయని అంచనా వేశారు. వచ్చే నీటి ప్రకారం మూడు రాష్ట్రాలకు నీటి కేటాయింపులు చేసినట్లు బోర్డు ఎస్ఈ ఆర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

కర్ణాటక: పవర్ కెనాల్, లోలెవెల్ కెనాల్(ఆర్.బి)14.590 టీఎంసీలు.
హైలెవెల్ కెనాల్ (ఆర్.బీ) 13.440, రాయబసవ కెనాల్ (ఆర్.బీ) 5.376 టీఎంసీలు, వీఎన్‌సీ, మరియు, ఆర్‌డీఎస్.1.912 టీఎంసీలు, లెఫ్ట్ బ్యాంక్ మెయిన్ కెనాల్, హైలెవెల్ కెనాల్ 71.423 టీఎంసీలు, వీటితో ఎల్, ఐ స్కీం ద్వారా, 4.123 టీఎంసీలు, జేవీఎస్ఎల్ స్కీం ద్వారా 1.900 టీఎంసీలు కేటాయించారు. కర్ణాటక కోటా 112.765 టీఎంసీలు కేటాయించారు

ఆంధ్ర వాటా: లోలెవెల్ కెనాల్(ఎల్లెల్సీ ఆర్.బీ) 19.472 హైలెవెల్ కెనాల్ (హెచ్చెల్సీ) 26.368 టీఎంసీలు, ఆర్ఏ నుండి కేసీ కేనాల్‌కు 8.113 టీఎంసీలు, మొత్తం ఆంధ్ర కోటా 53.953 టీఎంసీలు కేటాయించారు.

తెలంగాణా వాటా: ఆర్‌డీఎస్ కు 5.282 టీఎంసీలు ఇలా మొత్తం 172 టీఎంసీల నీటి అంచనాను 2024-25 ఏడాదికి కేటాయించామని బోర్డు అధికారులు తెలిపారు.



ఆగ్నేయంలో కాంగ్రెస్‌దే విజయం..!

పావగడ, జూన్ 6: ఆగ్నేయ ఉపాధ్యాయుల నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు దారుడు డీటీ శ్రీనివాస్ విజయం సాధించినట్లు తెలుస్తోంది. గురువారం బెంగళూరు ఆర్ట్స్ కళాశాలలో జరిగిన ఓట్ల లెక్కింపులో మొదటి ప్రాధాన్యం కలిగిన 2వేల ఓట్లతో డీటీ శ్రీనివాసులు ఆధిక్యంలో ఉన్నట్లు తెలిసింది. శ్రీనివాస్‌కు 8,920 ఓట్లు రాగా బీజేపీ అభ్యర్థి వైఎ నారాయణస్వామికి 7,120ఓట్లు, ఇండిపెండెంట్ అభ్యర్థి వినోద్ శ్రీనాథ్‌కు 6,881 ఓట్లు వచ్చినట్లు తెలిసింది. రెండో ప్రాధాన్యంలో కూడా శ్రీనివాస్‌కే ఆధిక్యత ఉన్నట్లు తెలుస్తోంది. అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

ఉండేనా..ఊడేనా..?

- లోక్‌సభ ఫలితాలతో మంత్రి పదవులపై టెన్షన్..
- సీఎం, డీసీఎంలకూ సొంత ప్రాంతాల్లో తప్పని పరాభవం..





బెంగళూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత మంత్రుల్లో ఆందోళన మొదలయ్యింది. తమ పదవులు ఉంటాయా..ఊడుతాయా అనే డోలాయామానం మొదలయ్యింది. లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థి ఓడితే జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిదే బాధ్యత అని పార్టీ అధిష్ఠానం టిక్కెట్లు కేటాయించక ముందే స్పష్టం చేసింది. అందుకే ఏడెనిమిది మంది మంత్రులు ఎవరెవరికోసమో ఎందుకు పనిచేయాలి... పిల్లలు, కుటుంబ సభ్యులకు టిక్కెట్‌లు ఇప్పించుకుని అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. అందులో ముగ్గురు మాత్రమే పంతం నెగ్గించుకున్నారు. మిగిలిన వారి పరిస్థితి సంక్లిష్టంగా మారింది. 28 లోక్‌సభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది 9 స్థానాల్లో మాత్రమే. బీజేపీ 17, జేడీఎస్ 2 స్థానాల్లో విజయం సాధించాయి. దీన్నిబట్టి 19 మంది జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులపై వేటు వేయాల్సి ఉంటుంది. మంత్రులను మార్పు చేయాలనే తేనెతుట్టె కదిపితే మొత్తానికే ఎసరు వస్తుందని అగ్రనేతలు వెనుకడుగు వేసే పరిస్థితి నెలకొంది. టిక్కెట్‌లు కేటాయించే సమయంలోనే కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ పదిమంది మంత్రుల జాబితాతో అధిష్ఠానానికి పంపిన సంగతి తెలిసిందే. ఎన్నికల్లో కష్టపడి ఖర్చు చేసి ఆరు నెలలకు ముందే మరోసారి ఎన్నికల్లోకి వెళ్లలేమని తేల్చి చెప్పారు. సీఎం సిద్దరామయ్య కూడా మంత్రులకు మద్దతుగానే నిలిచారు. ఇక అధిష్ఠానం కూడా మంత్రులకు టిక్కెట్‌లు వద్దంటూ వారించింది. అయితే మంత్రులు సూచించినవారినే అభ్యర్థులను చేస్తామని మెలిక పెట్టింది. శాసనసభ ఎన్నికల్లో అత్యధికంగా 135స్థానాల్లో గెలుపొందాము, లోక్‌సభ ఎన్నికల ఏకపక్షంగా ఉంటాయని మంత్రులు భావించారు. మరోవైపు ఐదు గ్యారెంటీలు కలసి వస్తాయని కూడా ధీమాలో ఉన్నారు. అందుకే కొడుకులు, కూతుళ్లు, కుటుంబ సభ్యులను అభ్యర్థులను చేశారు. కానీ ఫలితాలు తారుమారయ్యాయి. ఏకంగా 19 స్థానాల్లో అధికార కాంగ్రెస్ ఓటమి చవిచూసింది. వాస్తవానికి అభ్యర్థులు ఓడిన స్థానాల్లో ఇన్‌చార్జ్ మంత్రులు తొలగించాల్సి ఉంటుంది. అదే ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా ఉంది.

- ఇక డీసీఎం డీకే శివకుమార్ ప్రస్తావన రాష్ట్ర పార్టీలో కీలకమవుతోంది. ఆయన కేపీసీసీ అధ్యక్షుడిగా, బెంగళూరు నగర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా, జలవనరులశాఖ మంత్రితోపాటు డీసీఎంగాను వ్యవహరిస్తున్నారు. డీకే శివకుమార్ సొంతూరు కనకపురకు అనుబంధమైన బెంగళూరు గ్రామీణ నుంచి సిట్టింగ్ ఎంపీ, తమ్ముడు డీకే సురేశ్‌ను రాజకీయాలతో సంబంధం లేని, కేవలం వైద్య వృత్తికే పరిమితమైన డాక్టర్ సీఎన్ మంజునాథ్ 2.69 లక్షల ఓట్ల మెజారిటీతో ఓడించారు. ఈ పరిణామాన్ని డీకే శివకుమార్ జీర్ణించుకోలేకపోతున్నారు. ఇక బెంగళూరు జిల్లా పరిధిలోని మూడు లోక్‌సభ స్థానాలు బీజేపీ వారే తిరుగులేని మెజారిటీతో విజయం సాధించారు. అన్నివిధాలా డీకే శివకుమార్‌కు వెనుకబాటు అయ్యింది. ఇక సీఎం సిద్దరామయ్యకు ఆప్తుడైన మహదేవప్ప చామరాజనగర నుంచి కుమారుడు సునిల్‌బోస్‌ను గెలిపించుకున్నారు. కానీ ఆయన మైసూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా వ్యవహరించారు. ఇక బెళగావిలో కుమారుడుకి టిక్కెట్ ఇప్పించుకున్న ఏకైక మహిళా మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ పరాభవం చెందారు. మరో మంత్రి శివానంద పాటిల్‌ది కూడా ఇదే పరిస్థితి. రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి కూడా ఎదుర్కొంటున్నారు. జయనగర ఎమ్మెల్యే స్థానం నుంచి ఓడిన కుమార్తె సౌమ్యారెడ్డికి బెంగళూరు దక్షిణ టిక్కెట్ ఇప్పించుకున్నారు. వరుసగా రెండు ఎన్నికల్లో ఓటమికి ఆయనను బాధ్యులు చేసే అవకాశం సాధ్యమా..? అనేది కీలకమవుతోంది. మంత్రి మధుబంగారప్ప అక్క గీతాకు టిక్కెట్ సాధించుకుని శివమొగ్గలో ఓటమి చెందారు. ఇలా కీలకమైన మంత్రులు పరాభవంలో ఉన్నారు. ఒకవేళ బాధ్యులను చేసి మంత్రి పదవిని తొలగించాలని భావిస్తే పరిణామం అసలుకే ఎసరు అనేలా ఉందని ముఖ్యనేతలు మౌనంగా ఉన్నారు.

సీఎం సొంత జిల్లాలోనూ తప్పని ఓటమి



సీఎం సొంత జిల్లా మైసూరులోనూ పార్టీకి ఓటమి తప్పలేదు. దీంతో ఓడినందుకు వైఫల్యం చూపిస్తూ మంత్రి పదవిని దూరం చేసే పరిస్థితి లేకుండా పోతోంది. ఆరేడుమంది పేర్లు బయటకు వస్తే ఏకంగా ముఖ్యమంత్రి, డీసీఎంలపై కూడా వారు ఎదురు తిరిగే అవకాశం ఉంటుందని వెనుకడుగు వేస్తున్నారు. తొలగించే ప్రక్రియ ప్రారంభిస్తే మొత్తం ప్రక్షాళన చేయాల్సి వస్తుంది. అందుకే సీఎం, డీసీఎంలు ఫలితాల తర్వాత మంత్రుల గురించి నోరు మెదపడం లేదు. సీఎం సిద్దరామయ్య సొంత నియోజకవర్గం మైసూరులో కాంగ్రెస్ అధికార ప్రతినిధి లక్ష్మణ్‌కు టిక్కెట్ ఇప్పించారు. అక్కడ ప్రత్యర్థి యువరాజు యదువీర్ ఏకంగా 1.39లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఎన్నికల ప్రక్రియలో సీఎం సిద్దరామయ్య మైసూరులోనే రెండు నెలల వ్యవధిలో 40 రోజులకుపైగా గడిపారు. అయినా కాంగ్రెస్ అభ్యర్థి చిత్తుగా ఓటమి చెందారు. ఇందుకు ఎవరు బాధ్యత వహించాలనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఆదర్శప్రాయుడు అరసు: సీఎం

బెంగళూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): దేవరాజ్ అరసు ఆదర్శప్రాయుడని సెక్యులర్ భావాలతో పాలన సాగించిన నేత అని ముఖ్యమంత్రి సిద్దరామయ్య కొనియాడారు. దేవరాజ్ అరసు వర్ధంతిని పురస్కరించుకుని విధానసౌధలో గురువారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పశ్చిమద్వారంలోని దేవరాజ్ అరసు విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం



సీఎం మాట్లాడుతూ దేవరాజ్ అరసు ఎమిని దేళ్లపాటు ముఖ్యమంత్రిగా వ్యవహరించారని, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇచ్చారన్నారు. మైసూరు రాష్ట్రం కర్ణాటక ఏకీకరణ తర్వాత కర్ణాటక అని నామకరణం చేశారని కొనియాడారు. ఇదే సందర్భంగా విధానసౌధలో మొక్కను నాటారు. కన్నడ సంస్కృతిశాఖ మంత్రి శివరాజ్ తంగడిగి, ఎమ్మెల్సీ యూబీ వెంకటేశ్ సహా పలువురు పాల్గొన్నారు.



తప్పు చేశారా..? తప్పక



- మంత్రి నాగేంద్ర రాజీనామాపై జోరుగా చర్చలు
- సిద్దూ కేబినెట్‌లో తొలి వికెట్
- సీబీఐ దర్యాప్తునకు దిగిన రెండోరోజే..



సీఎం సిద్దరామయ్యకు రాజీనామా అందజేస్తున్న మంత్రి నాగేంద్ర

బెంగళూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మంత్రి నాగేంద్ర రాజీనామా రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. నిజంగా ఆయన తప్పు చేశారా.. ఒత్తిళ్లకు లోబడి నిర్ణయం తీసుకున్నారా.. అన్నది చర్చనీయాంశంగా మారింది. లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతున్న తరుణంలోనే రాష్ట్ర రాజకీయాల్లో మరో సంచలనం చోటు చేసుకుంది. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతి వివాదంలో సీఎం సిద్దరామయ్య కేబినెట్‌లో తొలి వికెట్ పడింది. యువజనులు, ఎస్టీ అభివృద్ధి శాఖ మంత్రి నాగేంద్ర గురువారం మంత్రి పదవికి రాజీనామా చేశారు. మూడు నెలల్లోనే అవినీతి అంశం దేశవ్యాప్తంగా చర్చకు కారణమై మంత్రి పదవికి రాజీనామా అనివార్యమైంది. మహర్షి వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో 94.73 కోట్ల రూపాయలు వివిధ ఖాతాలకు నగదు బదిలీ వివాదం బహిరంగమైంది. కార్పొరేషన్‌లో 187 కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల మార్చిలో కార్పొరేషన్‌కు సంబంధించి బెంగళూరు ఎంజీ రోడ్డు యూనియన్‌బ్యాంకు శాఖలో నిధులను హైదరాబాద్‌కు చెందిన ఏజెన్సీలు వ్యక్తిగత ఖాతాలకు బదిలీ జరిగింది. కార్పొరేషన్ అకౌంట్స్‌ను పర్యవేక్షించే సూపరింటెంట్ చంద్రశేఖర్ 12రోజులక్రితం అవినీతికి సంబంధించిన విషయాలను డెత్‌నోట్‌గా రాసి ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో కార్పొరేషన్‌లో అవినీతి వెలుగులోకి వచ్చింది. అదే రోజునుంచే అవినీతికి వ్యతిరేకంగా బీజేపీ ఆందోళన చేసింది. అధికారి భార్యను బీజేపీ నేతలు పరామర్శించారు. వివాదం తీవ్రం కావడంతో ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులతో సిట్ ఏర్పాటు చేసింది. రంగంలోకి దిగిన సిట్, కార్పొరేషన్‌కు సంబంధించి, ఆత్మహత్య చేసుకున్న చంద్రశేఖర్ డెత్‌నోట్‌లో పేర్కొన్న ఇద్దరు అధికారులను అదుపులోకి తీసుకుంది. నగదు బదిలీ వెనుక యూనియన్ బ్యాంకుకు చెందిన బ్రాంచ్ మేనేజర్‌తోపాటు ఇతరుల ప్రమేయం ఉందని సిట్ గుర్తించింది. కోట్లాది రూపాయల అవినీతి చోటు చేసుకోవడం, మరోవైపు బ్యాంకు ముఖ్యుల పేర్లను దర్యాప్తు సంస్థ ప్రస్తావించడాన్ని బ్యాంకు సీఎండీ సీరియస్‌గా భావించారు. ఈ వివాదంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ లేఖ రాశారు. బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ మహేశ్ లేఖతో రెండు రోజుల క్రిందట రంగంలోకి దిగిన సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఇప్పటివరకు దర్యాప్తు చేసిన అధికారుల నుంచి నివేదికను సేకరించింది. బుధవారం మంత్రి నాగేంద్రకు ఆప్తులైన నక్కంటి నాగరాజ్, నాగేశ్వరరావులను అరెస్టు చేశారు. ఇక మంత్రికి ఉచ్చు బిగుస్తుందని భావించి సీఎం, డీసీఎంలు అప్రమత్తమయ్యారు. గురువారం ఉదయం సీఎం సిద్దరామయ్య మంత్రి నాగేంద్రతో చర్చలు జరిపారు. కాంగ్రెస్ కార్యాలయంలో డీసీఎంను మంత్రి నాగేంద్ర భేటీ అయ్యారు. అంతలోనే మంత్రి నాగేంద్ర సాయంత్రం 4.30 గంటలకు విధానసౌధలో అత్యవసరంగా మీడియా సమావేశానికి ఆహ్వానించారు. దీంతో రాజీనామా ఖరారైనట్లు తెలిసింది. మంత్రి నాగేంద్ర మీడియాతో మాట్లాడుతూ గడిచిన రెండు వారాలుగా కార్పొరేషన్‌లో జరిగిన అవినీతిపై తన పేరు ప్రస్తావన ఉన్నందున మంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఎవరి ఒత్తిడి లేదని అయినా ఆరోపణలు ఎదుర్కొంటున్నందున నైతిక బాధ్యత వహిస్తున్నా అన్నారు. దర్యాప్తుకు సహకరిస్తానన్నారు.

అభిమానుల్లో ఆందోళన..!

బళ్లారి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మంత్రి నాగేంద్ర రాజీనామాతో అభిమానుల్లో ఆందోళన నెలకొంది. వాల్మీకి నాయకుడిగా పేరొంది, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి కేబినెట్‌లో నాగేంద్ర స్థానం సంపాదించుకున్నారు అటువంటి కీలక వ్యక్తి నేడు అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడం పార్టీలో కలకలం రేపుతోంది. అసలు ఆరోపణల్లో నాగేంద్ర పాత్ర ఎంత.. అసలు ఆయన చేతి వాటం ఉందా..? లేదా...? అనేది ఇంకా తేలలేదు. ప్రతిపక్షం ఆందోళనతో ప్రభుత్వం ఇరుకున పడింది. దీంతో మంత్రి రాజీనామా చేయక తప్పలేదు. గత్యంతరం లేకే రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. సీఎం, డీసీఎంలతో చర్చించే రాజీనామా చేశానని మంత్రి మీడియా ముందు వెల్లడిం చారు. వాల్మీకీ సముదాయంలో రాష్ట్ర నాయకుడిగా ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న నాగేంద్రకు ఇలాంటి దెబ్బ తగలడం ఆయన వర్గీయుల్లో బాధాకరంగా మారింది.

విధానసౌధ ఆందోళనలో వద్ద బీజేపీ నాయకులు



విధానసౌధ నుంచి రాజ్‌భవన్ దాకా బీజేపీ ర్యాలీ

వాల్మీకి కార్పొరేషన్ అవినీతిపై బీజేపీ ప్రారంభం నుంచే నిరసనల హోరు కొనసాగిస్తోంది. కార్పొరేషన్ అకౌంటెంట్ చంద్రశేఖర్ ఆత్మహత్య రోజునుంచే బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టింది. గురువారం విధానసౌధలో గాంధీ విగ్రహం నుంచి ప్రతిపక్షనేత అశోక్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. లూటీకి పాల్పడిన మంత్రి నాగేంద్ర రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అక్కడనుంచి రాజ్‌భవన్ దాకా ప్లకార్డులతో నిరసన తెలిపారు. అక్కడ గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌ను భేటీ అయి వాల్మీకి కార్పొరేషన్ అవినీతిపై వినతిపత్రం సమర్పించారు. మంత్రిచేత రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. అనంతరం రాజ్‌భవన్ వద్ద వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడినవర్గాల సంక్షేమంకోసం ఏర్పడిన కార్పొరేషన్ గ్రాంట్లను సొంతఖాతాలకు, ఏజెన్సీలకు బదిలీ చేశారన్నారు. వీటి వెనుక ప్రముఖుల ప్రమేయం ఉందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి సొమ్ము పంపారని ఆరోపించారు. బీజేపీ ఎమ్మెల్యేలు సునిల్‌కుమార్, అరవింద్ బెల్లద్, అశ్వత్థనారాయణ, రవిసుబ్రమణ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.




11 మంది ఏకగ్రీవం

- శాసనసభ్యుల కోటాలో విధాన పరిషత్‌కు ముగిసిన ఎన్నికలు

బెంగళూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ సభ్యుల నుంచి విధానపరిషత్‌కు సభ్యులను ఎన్నుకునేందుకు జరిగిన ప్రక్రియ ఏకగ్రీవమయ్యింది. 11 మంది విధానపరిషత్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని శాసనసభ కార్యదర్శి, ఎన్నికల అధికారి ఎంకే విశాలాక్షి గురువారం ప్రకటించారు. కాంగ్రెస్ నుంచి మంత్రి బోసరాజు, ఐవాన్ డిసోజా, సీఎం రాజకీయ కార్యదర్శి గోవిందరాజు, జగదేవ్ గుత్తేదార్, సీఎం సిద్దరామయ్య కుమారుడు డాక్టర్ యతీంద్ర, బిల్కిస్ బాను, వసంతకుమార్‌లు కాగా బీజేపీ నుంచి మాజీ మంత్రి సీటీ రవి, పార్టీ అధికార ప్రతినిధి ఎన్. రవికుమార్, ఎంజీ ములె, జేడీఎస్ సీనియర్ నేత టీఎన్ జవరాయగౌడలు ఉన్నారు. పరిషత్‌కు ఎన్నికైన వారిలో పలువురు ప్రముఖులున్నారు. ప్రస్తుతం చిన్నతరహా నీటిపారుదల శాఖా మంత్రిగాను విధానపరిషత్ సభానాయకుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం పరిషత్‌లో ఉండే ఏకైక మంత్రి కూడా ఇతనే కావడంతో మరోసారి అవకాశం దక్కింది. అధిష్ఠానం కోటా ద్వారా బోసరాజుకు రెండోఛాన్స్ దక్కినట్లు అయ్యింది. ఇక సీఎం సిద్దరామయ్య కోటా ద్వారా కుమారుడు యతీంద్రతో పాటు రాజకీయ కార్యదర్శి గోవిందరాజు రెండోసారి అవకాశం దక్కించుకున్నారు. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జునకోటాలో కలబురిగి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు జగదేవ్ గుత్తేదార్ ఉన్నారు. కేపీసీసీ కార్యాధ్యక్షుడు వసంతకుమార్, మైనార్టీ కోటాలో మరోసారి మంగళూరుకు చెందిన ఐవాన్ డిసౌజాకు దాదాపు 30 ఏళ్ళుగా పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించిన బిల్కిస్ బాను తొలిసారి ఎమ్మెల్సీ అయ్యారు. బీజేపీ నుంచి మరోసారి రవికుమార్ ఎమ్మెల్సీ కాగా పార్టీ సీనియర్ నేత సీటీ రవి, మరాఠా సంఘం ముఖ్యులు ఎంజి ములెలు ఉన్నారు. జేడీఎస్‌లో సీనియర్‌నేతగా యశ్వంతపుర నుంచి పలుమార్లు పోటీ చేసి ఓడిన జవరాయగౌడ పరిషత్‌కు తొలిసారి ఎన్నికయ్యారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన ఎమ్మెల్సీలు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.14	1,581.10
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1581	723
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10	251
సామర్థ్యం (టీఎంసీలు)	3.63	5.03

ఘనంగా శనైశ్చర జయంతి



పూజలందుకున్న జేష్టాదేవి సమేతుడైన శనైశ్వరస్వామి

పావగడ, జూన్ 6 : వైశాఖ అమావాస్య శనైశ్వర జయంతి సందర్భంగా గురువారం పావగడలో జేష్టా దేవి సమేతుడైన స్వామివారికి ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. స్వామివారికి నూనెతో అభిషే కంచేసి నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనైశ్వర జయంతి సందర్భంగా ఆయన్ను దర్శించుకుంటే అష్టమశని, అర్ధాష్టమశని, కాకి స్పర్శ, తదితర దోషాలు వైదొలుగుతాయని, అష్టైశ్వర్యాలు కలిసి వస్తాయని ప్రధాన అర్చకులు సత్యనారాయణ శాస్త్రి తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

కంప్లి, జూన్ 6 : కంప్లి పట్టణం సత్యనారాయణ పేట లోని వెంకటరమణ దేవస్థానంలో శనైశ్వర జయంతిని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ కార్య క్రమంలో శ్రీమన్నారాయణ విద్యాభారతి స్వామి పాల్గొని



ప్రత్యేకాలంకరణలో కాళికాదేవి

పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా కంప్లి, కురుగోడు, కుడితిని తదితర గ్రామాల్లో పూజలు చేపట్టారు. కంప్లి షుగర్ ఫ్యాక్టరీలో కాళికాదేవికి ఆకుపూజ చేపట్టారు. బుక్కసాగర కొండల్లో ఏళపడగల నాగప్పకు ప్రత్యేకపూజలు చేశారు.

వైభవంగా తాయమ్మదేవికి పూజలు



ప్రత్యేకాలంకరణలో తాయమ్మదేవి

సిరుగుప్ప, జూన్ 6 : అమావాస్య పురస్కరించుకుని శ్రీ తాయమ్మదేవికి ప్రత్యేక పూజలు జరిగాయి. సిరుగుప్ప పట్టణం ఆదోని రోడ్డు మార్గంలో వెలసిన తాయమ్మదేవి దర్శనం కోసం ఉదయం నుంచి భక్తిశ్రద్ధలతో భక్తులు బారులుతీరారు. ప్రధాన అర్చకులు శ్రీనివాస, ప్రవీణ్ దేవికి పుష్పాలంకార సేవ, కుంకుమాభిషేకం, వెండితో అలంకరణ చేశారు. ప్రసాద పంపిణీ చేపట్టారు.

పోరాట స్ఫూర్తిని పెంచుకోవాలి



మాట్లాడుతున్న సుభాస్, విజయ్‌కామత్ తదితరులు

బళ్లారి సిటీ, జూన్ 6: విద్యార్థులు సామాజిక సమస్యలపై పోరాడే స్ఫూర్తిని పెంపొందించుకోవాలని, ఏఐడీఎస్ఓ సుభాస్ అన్నారు. నగరంలోని ఏఐడీఎస్ఓ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం విద్యాసంవత్సరం ప్రారంభమైందని ఫీజుల పెంపు, విద్యార్థుల భృతి, బస్సు సమస్యలపై ఐక్యంగా పోరాడాలన్నారు. తదనంతరం ఏఐడీఎస్ఓ రాష్ట్రకార్యదర్శి అజయ్ కామత్ మాట్లాడుతూ డిల్లీలో జరిగిన రైతుల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని మన రాష్ట్రంలో కూడా ఎన్‌ఈపీకి వ్యతిరేకంగా బలమైన పోరాటాన్ని జరపాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు అలాగే ఉండాలని, భగత్‌సింగ్ నేతాజీ లాంటి మహావ్యక్తులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా ఏఐడీఎస్ఓ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు రవికిరణ్, జిల్లాధ్యక్షులు ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో జనజీవనం అతలాకుతలం

- ఎక్కడ చూసినా నీరే....
- కుంభవృష్టితో ఇళ్లలోకి వర్షపు నీరు
- పొంగిపొర్లుతున్న జంబునాథ చెరువు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం





కొండల్లో నుంచి ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు



నీటమునిగిన పంటలు



రాయర తాండాలో కూలిన రత్నమ్మ ఇల్లు



చిలగూడు చెరువు నిండి ప్రవహిస్తున్న దృశ్యం

బళ్లారి సిటీ, జూన్ 6: జిల్లాలో గత రెండురోజులుగా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురువగా వాగులు, కుంటలు, వాగులు పొంగిపొర్లాయి. బళ్లారి జిల్లాలోని తోరణగల్లు, రాజాపూర్, ఉబ్బలగండి, కెరెరాంపురం తదితర గ్రామాల్లో 15 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని కర్ణాటక రాష్ట్ర ప్రకృతి విపత్తు నిర్వహణ కేంద్రం అధికారులు తెలిపారు.

వర్షం కారణంగా బళ్లారి జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో, పలు పాఠశాలలు, కళాశాలలు, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. బళ్లారిలోని మురికివాడల్లో డ్రైనేజీలు నిండి మురికినీరు ఇళ్లలోకి చేరడంతో నిర్వాసితులు రాత్రంతా నిద్రాహారాలు మాని ఇళ్లలోని మురుగునీటిని బయటకు తోడిపారబోశారు.

వర్షం కారణంగా నగర పరిధిలో పలు చోట్ల స్తంభాలు నేలకూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జెస్కాం తీరుపై ప్రజా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.

అధిక శాతం వర్షం పడిన ప్రాంతాలు

సండూర్‌లోని విఠలాపురం, బళ్లారిలోని మోకా గ్రామం రెయిన్ గేజ్‌స్టేషన్ లో 10సెంమీ కంటే ఎక్కువ వర్షం కురిసినట్టుగా నమోదయింది. సిరుగుప్ప తాలూకా కె.బెళగల్లులో 7.50 సెంమీ, సండూర్‌లోని కురెకుప్పలో 7సెంమీ, చోరనూర్‌లో 6.6సెంమీ. వర్షం కురిసింది.

టీబీడ్యాంకు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

బళ్లారిరూరల్, జూన్ 6 : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా హొస్పేట తుంగభద్ర జలాశయానికి స్వల్పంగా ఇన్‌ఫ్లో చేరుతోంది. బుధవారం నాటికి ఇన్‌ఫ్లో 495 క్యూసెక్కులు వుండగా గురువారం ఉదయానికి అది 1499 క్యూసెక్కులకు పెరిగింది. ప్రస్తుతం డ్యామ్‌లో నీటి నిల్వ 3.63 టీఎంసీలు వున్నట్లు అధికారులు వెల్లడించారు.

హగరిబొమ్మన హళ్ళిలో భారీ వర్షం

జిల్లాలోని రాయర తాండకు చెందిన గౌడ్రు రత్నమ్మ, కమలబాయి, కెచ్చినబండి గ్రామానికి చెందిన రత్నమ్మ బసవరాజుల ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి. కిత్నూర్ గ్రామంలోని ప్రభుత్వ సీనియర్ ప్రాథమిక పాఠశాల ఆవరణ వర్షపు నీటితో నిండిపోయింది. బ్యాలహాళు, హనసి, చిలగూడు సరస్సులోకి భారీగా వర్షపు నీరు చేరింది. హగరిబొమ్మనహళ్ళిలో 4.66 సెంమీ, తంబ్రహళ్లిలో 5.16సెంమీ, హంపసాగరంలో 6.04సెంమీ వర్షం కురిసింది.

కంప్లి, జూన్ 6 : గత రెండు రోజులుగా విజయనగర జిల్లాల్లో కురుస్తున్న వర్షాలకు ఈ ప్రాంతమంతా జలమయమైంది. ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే వచ్చి బళ్లారి, విజయనగర, కొప్పళ జిల్లాల్లో పుష్కలంగా వర్షాలు కురుస్తుండటంతో వాగులు, వంకలు పొంగిప్రవహిస్తున్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు విజయనగర జిల్లాలో జంబునాథ హళ్లి ప్రాంతంలో వుండే రాయల చెరువు పూర్తిగా నిండిపోయింది. అక్కడ వేసుకున్న చెరకు, అరటి, మొక్కజొన్న పంటలు పూర్తిగా నీట మునిగాయి. అలాగే దానిమ్మ తోటల్లో నీరు నిలిచి రైతులకు నష్టం వాటిల్లింది. అలాగే సండూరు కొండల్లో నుంచి కూడా నీటి ప్రవాహం ధారగా వస్తోంది. రైతులు మాత్రం ముంగారు పంటలకు సిద్ధం అయ్యారు. కంప్లి, కురుగోడు తాలుకాలో మెట్రి, దేవసముద్రం, దేవలాపురం ప్రాంతాల్లో మాత్రం పత్తి, మొక్కజొన్న జోరుగా విత్తుతున్నారు.

సేద్యానికి విత్తనాలు, ఎరువులు సిద్ధం

- వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ తిరుమలేష్

బళ్లారి గాంధీనగర్, జూన్ 6: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులకు అవసరమైన ఎరువులను, విత్తనాలను సిద్ధంగా ఉంచినట్లు జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ తిరుమలేష్ తెలిపారు. వ్యవసాయదారుల కోసం 67,478మెట్రిక్ క్వింటాళ్ల రసాయనిక ఎరువులను, 16,223 క్వింటాళ్ళ విత్తనాలను నిలువ ఉంచినట్లు తెలిపారు. జిల్లాలో వార్షిక వర్షపాతం 599.9మిల్లీమీటర్లు ఉండగా, జనవరి నుండి జూన్ ఒకటవ తేదీ వరకు 81.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు దీంతో జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ పనులు చురుకుగా సాగుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన వరి, జొన్న, మొక్కజొన్న, సూర్యకాంతి, వేరుశెనగ, శెనగ, కంది, రాగి తదితర పంటలకు సంబంధించి 16,223 క్వింటాళ్ళ విత్తనాలకు డిమాండ్ ఉందన్నారు. కెఎస్ఎస్‌సి, ఎన్ఎస్‌సి, కెఓఎఫ్ ప్రైవేట్ విత్తన సరఫరా సంస్థల్లో 32,789 క్వింటాళ్ళ విత్తనాలు నిలువ ఉంచినట్లు తెలిపారు. జిల్లా రైతుల డిమాండ్‌కు అనుగుణంగా విత్తనాలు, ఎరువులు పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 299 క్వింటాళ్ళ విత్తనాలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

జిల్లాలో 4,00,043 హెక్టార్ల భౌగోళిక ప్రాంతం ఉండగా, 2,78,227 హెక్టార్ల ప్రాంతం సాగుకు సిద్ధమైందన్నారు. మొత్తం 1,59,662 మంది రైతులు సాగుదారులను గుర్తించినట్లు తెలిపారు.

జిల్లాలో ఈ ఏడాది ఆశించిన రీతిలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో ఈ ఖరీఫ్‌లో ఉత్సాహంగా రైతులు పంటభూములను సాగుచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను జిల్లా పరిధిలోని రైతు సంపర్క కేంద్రాల్లో పంపిణీకి సిద్ధంగా ఉంచినట్లు వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ తిరుమలేష్ పేర్కొన్నారు.

రైతుల పట్ల నిర్లక్ష్యం వద్దు



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి బసవరాజు

కంప్లి, జూన్ 6 : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల నిర్లక్ష్యం చూపరాదని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం హసురుసేన (కార్తీక బన) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవరాజు గూడేహాళ్ హితవుపలికారు. కంప్లి పట్టణంలోని సంగాత్రేయ పాఠశాలలో రైతులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం హామీలకే పరిమితమయ్యాయని, జిల్లాలో రైతులకు జరుగుతున్న అన్యాయంపై ఏప్రభుత్వం దృష్టి సారించలేదన్నారు. రైతులు నష్టపోయి ఆత్మహత్యలు చేపట్టుకుంటున్నా వారి కుటుంబాలను ఇంతవరకు ఆదుకోలేదన్నారు. అలాగే జొన్నల కొనుగోలు కేంద్రంలో కొనుగోలు చేసి నెలలైనా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదన్నారు. గ్రామాలు, పట్టణాల్లో నాసిరకం విత్తనాలు, మందులు అమ్మేవారిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి లేని పథకాలపేరుతో ఉన్న నిధులన్నీ వృథా చేస్తోందన్నారు. అనంతరం తాలుకా అధ్యక్షులు చెన్నప్ప మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమయ్యాయని సరియైన సమయానికి ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమ తరగతులు కూడా ప్రారంభించాలన్నారు. అలాగే ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు పెంచరాదన్నారు. రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శివరాజ్, ఉలిగయ్య, రుద్రప్ప, మాధవ్, వెంకటేష్, మహదేవప్ప, దేవప్ప, రామప్ప, వీరభద్ర, రమేష్, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

మంత్రి భోసరాజు ఎన్నిక ఏకగ్రీవం



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీలు, భోసరాజు, వసంత్‌కుమార్

రాయచూరు, జూన్ 6 : ఎమ్మెల్యేల కోటాలో శాసన మండలికి జరిగే ఎన్నికలలో పోటీ చేసిన రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖమంత్రి ఎన్.ఎస్.భోసరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శాసన మండలిలో ఖాళీగా ఉన్న 11 స్థానాలకు ఎన్నిక నిర్వహించగా నామినేషన్‌ల దాఖలుకు ఈ నెల 3వ తేదీ చివరి గడువుగా నిర్ణయించారు. నామినేషన్‌ల ఉపసంహరణకు నేటితో గడువు ముగిసింది. ఉపసంహరణ గడువు పూర్తయ్యేలోగా బరిలో కేవలం 11 మంది అభ్యర్థులు మాత్రమే మిగలడంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ గురువారం వారిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించింది. కాగా శాసన మండలికి ఎన్నికైన 11 మందిలో జిల్లాకు చెందిన మంత్రి భోసరాజుతో పాటు కేపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వసంత్‌కుమార్ కూడా ఉండడం గమనార్హం. జిల్లాకు చెందిన ఇద్దరు నాయకులు ఒకే సారి మండలిలోకి అడుగు పెడుతుండడం ఇది మొదటి సారి. ఈ చారిత్రక విజయంలో భాగస్వాములైయ్యేందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు ముఖ్యంగా మంత్రి భోసరాజు, వసంత్‌కుమార్ మద్దతుదారులు పెద్దసంఖ్యలో బెంగళూరుకు తరలివెళ్లారు.

నీట్ పరీక్షలో బళ్లారి విద్యార్థికి అగ్రస్థానం



సృజన   వాసుశ్రీ

బళ్లారి సిటీ, జూన్ 6: 2024 నీట్ పరీక్ష ఫలితాల్లో బళ్లారి నారాయణ కళాశాలకు చెందిన సృజన 668/720 మార్కులు సాధించి బళ్లారి జిల్లాకంతటికీ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ కళాశాలకు చెందిన మరోవిద్యార్థిని వాసుశ్రీ 643/720 మార్కులు సాధించింది. విద్యార్థుల ఈ విజయాన్ని నారాయణ శాఖ కోర్ డీన్ సురేంద్రనాథ్‌రెడ్డి, లవణకుమార్, ప్రిన్సిపాల్ మహమ్మద్ గౌస్ భాషా, సిబ్బంది అభినందించారు.

సత్తా చాటిన సత్యం కాలేజీ విద్యార్థులు

బళ్లారి సిటీ,జూన్ 6:ఈనెల 5న విడుదలైన నీట్ పరీక్షా ఫలితాల్లో నగరంలోని సత్యం కాలేజీ విద్యార్థులు సత్తాచాటారని ప్రిన్సిపాల్ విద్యాసాగర్ తెలిపారు. తమ కాలేజ్ టాప్‌స్కోరర్ కోటేశ్ 640/770మార్కులు సాధించగా, సోయాబ్‌ఫాతిమా 607/770, చంద్రశేఖర్ 559/770, ఆకాశ్ 551/770 మార్కులు సాధించారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను, విద్యార్థులను కాలేజీ పాలకమండలివారు అభినందించారు.



కోటేశ్   సోయాబ్ ఫాతిమా

జ్ఞానామృత కాలేజీ విద్యార్థి ప్రతిభ



దేవరాజు

బళ్లారి సిటీ, జూన్ 6: జాతీయస్థాయి మెడికల్ ప్రవేశ పరీక్షలో బళ్లారి జ్ఞానామృత పీయూ కాలేజీ విద్యార్థి దేవరాజు 618 మార్కులు సాధించి తమ కాలేజీకి మంచి పేరు తెచ్చారని ప్రిన్సిపాల్ యసవంత్‌రాజ్ తెలిపారు. ఉత్తమ ర్యాంకు సాధించిన దేవరాజుకి కాలేజ్ యాజమాన్యం అభినందనలు తెలియజేసింది.

పిడుగుపాటుకు గుర్తు తెలియని వ్యక్తి మృతి

బళ్లారిరూరల్, జూన్ 6 : తాలుకాలోని రూపనగుడి గ్రామ సమీపంలో కొత్తకోటకు వెళ్లే వ్యవసాయ పొలంలో దాదాపు 50 నుంచి 54 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి నాలుగు రోజుల క్రితం పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం అటుగా వెళ్లిన స్థానికులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అయితే మృతుని మోహం గుర్తించేందుకు వీలులేకుండా వుండటంతో ఆ మృతదేహాన్ని బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. దీనిపై పీడీ హళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

9న ఉచిత ఆరోగ్య శిబిరం

బళ్లారిరూరల్, జూన్6:బళ్లారి నగరంలోని విద్యానగర్ అభయాంజనేయస్వామి ఆలయంవద్ద 4వ క్రాస్‌లో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి 4 గంటల వరకు భాగ్య ఆస్పత్రి ఆధ్వర్యంలో డాక్టర్ రేణుకా రెడ్డి సమక్షంలో ఎముకలకు సంబంధించిన వ్యాధులు, గుండె జబ్బులు, ఆస్తమా తదితర జబ్బులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాన్ని అభయాంజనేయస్వామి సేవా ట్రస్టు సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కంప్లి, జూన్ 6 : లోకాయుక్త సీఐ మహమ్మద్ రఫీక్ కంప్లి షుగర్‌ఫ్యాక్టరీలోని అంగన్ వాడీ కేంద్రం-2ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడున్న సూపర్‌వైజర్ లతీఫా బేగమ్, అంగన్ వాడీ టీచర్ ఉలిగమ్మ వద్ద సమస్యలపై ఆరా తీశారు. పిల్లలకు అంగన్‌వాడీ శిక్షణే ప్రథమ శిక్షణ అని ప్రతి ఒక్కరు పిల్లలకు ప్రభుత్వం ద్వారా అందించే పౌష్టికాహారంతో పాటు విద్యను కల్పించాలన్నారు.

హోసూరు జోన్

డ్యాంకు నీటి ప్రవాహం పెరుగుదల: రైతుల్లో సంతోషం



కెలవరపల్లి డ్యాం నుంచి బయటకు దూకుతున్న నీరు

హోసూరు(సిఫ్‌కాట్) జూన్ 6: దక్షిణా పినాకి నదికి అడ్డంగా నిర్మించిన కెలవరపల్లి డ్యాంకు సెకనుకు 892 క్యూబిక్ అడుగుల నీటి ప్రవాహం రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కెలవరపల్లి డ్యాం తూముల నిర్వహణ కోసం గతేడాది జూన్‌లో డ్యాంలో పూర్తిగా నీరు తీసేశారు. ఈ క్రమంలో గత నెలలో తూముల్లో కొత్త షట్టర్లు మార్చి నీటిని నిల్వ చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా కర్ణాటక రాష్ట్రంలోని పరీవాహక ప్రాంతంల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా డ్యామ్‌లోకి నీరు చేరింది. దీంతో గురువారం డ్యాంలోకి సెకను కు 890 క్యూబిక్ అడుగుల నీరు చేరుకుంది. డ్యాం పూర్తి సామర్థ్యం 44.28 అడుగులు కాగా ప్రస్తుతం 37 అడుగుల మేర నీరు నిల్వ ఉంది. నదిలోకి గేట్లు తెరిచి నీరు వదులుతున్నారు. 38 అడుగులకు నీరు వస్తేనే సాగునీటికి నీరు వదులుతామని ప్రజాపనుల శాఖ చెబుతుండగా త్వరలోనే సాగు నీరు వస్తుందని రైతులు ఎదురు చూస్తున్నారు.

చిరుతై పార్టీ గెలుపు.. మిఠాయిల పంపిణీ

హోసూరు జూన్ 6: చిదంబరం, విళుపురం అనే రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో విజయం, సాధించి ఎన్నికల గుర్తింపు పొందినందుకు విసిక వినర్ హోసూరు బస్ స్టేషన్‌లో చిరుతైపార్టీ వారు ప్రజలకు మిఠాయిలు పంచుతూ సంబరాలు చేసుకున్నారు. హోసూరు బస్ స్టేషన్‌లో లిబరేషన్ టైగర్స్ పార్టీ మహానగర జిల్లా కార్యదర్శి రామచంద్రన్ ప్రజలందరికీ మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కే.స్టాలిన్ నేతృత్వంలో లిబరేషన్ టైగర్స్ పార్టీ కూటమిలో భాగమైంది. ఇటీవల ముగిసిన పార్లమెంట్ ఎన్నికల్లో చిదంబరం పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు తొల్ తిరుమావళవన్ విళుపురం పార్లమెంట్ నియోజకవర్గం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్‌లు రెండు నియోజకవర్గాల్లో పోటీ చేశారు. వారు ఈరెండు నియోజకవర్గాల్లో లక్షకు పైగా ఓట్లు అధిక్యంతో గెలుపొందారు. ఈ విజయంతో భారత ఎన్నికల సంఘం గుర్తింపు పొందామని, అలాగే చిరుతపల్లి పార్టీ ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంల్లో ప్రాంతీయ ఉప కార్యదర్శి మాయవన్, కృష్ణగిరి పార్లమెంటరీ కార్యదర్శి సెంతమిళ్, ర్యాలీ ఆర్గనైజర్ సూర్యవళవన్, మారప్ప, రాజగోపాల్, అటోశివ, మలర్మన్నన్, కళాసెల్వన్ ముకుందన్, తోపయ్య, భాషా, రామకృష్ణన్, రామచంద్రన్, అప్పయ్యప్ప, లక్ష్మణన్, బోళప్ప, కాళిదాస్, వెంకటేశ్, గణేశన్ తదితరులు పాల్గొన్నారు.



విడుదలా చిరుతై పార్టీ గెలుపుతో సంబరాలు చేసుకుంటున్న కార్యకర్తలు

పానీపూరీ తిని విద్యార్థినులకు అస్వస్థత



అస్వస్థతకు గురైన విద్యార్థిని

రాయచూరు, జూన్ 6 : నగరంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన 20 మంది విద్యార్థినిలు ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. బుధవారం రాత్రి విశ్వ విద్యాలయం నుంచి బయటికి వచ్చిన విద్యార్థినులు రోడ్డుపై ఆగి ఉన్న చాట్ భండార్ బండిలో పానీపూరి తిన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వీరిలో కొంతమంది ఆమ్‌లేట్‌లు కూడా తిని ఇంటికి వెళ్లారు. రాత్రి వీరందరికి వాంతులు విరేచనాలు కావడంతో కుటుంబ సభ్యులు వారిని చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విద్యార్థినులందరు ఆరోగ్యంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రెండు బైకులు ఢీ.. ఒకరు మృతి

బళ్లారిరూరల్, జూన్ 6 : తాలుకాలోని రూపనగుడి సమీపంలో గురువారం మధ్యాహ్నం రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో అహంభావి గ్రామానికి చెందిన బాబు (54) అక్కడికక్కడే మృతి చెందాడు. బాబు మరో ఇద్దరు ఆవళిగి నుంచి బళ్లారి వైపు వస్తుండగా బళ్లారి నుంచి వస్తున్న వన్నూరుస్వామి వారిని ఢీకొన్నారు. దీంతో బాబు అక్కడికక్కడే మృతి చెందగా వన్నూరు స్వామికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. దీనిపై పీడీ హళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మద్యం లోడ్‌తో వెళుతున్న లారీ బోల్తా

రాయచూరు, జూన్ 6 : మద్యం లోడ్‌తో వెళుతున్న లారీ ఒకటి తాలూకాలోని హెగ్గసనహళ్ళి వద్ద బుధవారం బోల్తా గొట్టింది. ఉదయం 8 గంటల ప్రాంతంలో ఈ సంఘటన జరగగా ఈ మార్గంలో వాహన రాకపోకలు దాదాపు గంటకు పైగా నిలిచిపోయాయి. రోడ్డు మధ్య భాగంలో లారీ బోల్తాగొట్టి మద్యం బాటిళ్లు పడి ఉండడంతో వాహనదారులు ఈ మార్గం గుండా వెళ్లేందుకు ఇబ్బందికి గురయ్యారు. ఈ మార్గంలో పెద్దసంఖ్యలో బస్సులు సంచరిస్తుండగా ఎక్కడవి అక్కడ నిలిచిపోవడంతో ప్రయాణీకులు అధికారుల తీరుపట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగి గంట దాటుతున్నా లారీని పక్కకు తప్పించి రాకపోకలకు వీలు కల్పించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడాన్ని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ రభస ఒకవైపు సాగుతుండగా లారీ బోల్తాగొట్టిన సందర్భంగా చెల్లాచెదురుగా పడి ఉన్న బీరు బాటిళ్లు, మద్యం సీసాలను ఎత్తుకెళ్లేందుకు కొంతమంది ఇరుగు-పొరుగు గ్రామాలకు చెందిన వారు ప్రయత్నించగా వారిని అడ్డుకునేందుకు లారీ డ్రైవర్, క్లీనర్ దాదాపు వారితో యుద్ధం చేయాల్సి పరిస్థితి తలెత్తింది. అనంతరం వాహనాన్ని పక్కకు తప్పించడంతో ఈ మార్గంలో రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి.




చెల్లాచెదురుగా పడి ఉన్న మద్యం బాటిళ్లు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

మహేశ్ భూపతి (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత మహేశ్ శ్రీనివాస్ భూపతి 1974 జూన్ 7న చెన్నైలో జన్మించారు. టెన్నిస్‌లో గ్రాండ్‌స్లామ్ గెలుపొందిన తొలి భారతీయుడిగాను, వరల్డ్ నెంబరు వన్‌గా నిలిచారు. 2006లో ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో విజయం సాధించడంతో 'ఎలైట్ గ్రూప్ ఆఫ్ 8 టెన్నిస్‌ప్లేయర్స్'లో చేరారు. లియాండర్ పేస్‌తో కలసి డబుల్స్‌లో పలు విజయాలు అందుకున్నారు. 'ఇంటర్నేషనల్ ప్రీమియర్ టెన్నిస్ లీగ్ 'సంస్థాపకులలో ఒకరు. 2016లో నాన్‌ప్లేయింగ్ డేవిస్ కప్ కెప్టెన్‌గా వ్యవహరించారు. టెన్నిస్ అభివృద్ధికి కృషి చేసి పలువురు క్రీడాకారులను ప్రోత్సహించారు.

గడాఫి (జయంతి)



లిబియా దేశ ఉద్యమ నాయకుడు ముమ్మర్ ముహమ్మద్ అబు మిన్యార్ అల్-గడాఫి 1942 జూన్ 7న జన్మించారు. కల్నల్ గడాఫిగా పేరొందారు. రాజకీయ నేత, సిద్ధాంతకర్త. లిబియాన్ అరబ్ రిపబ్లిక్‌కు 1969 నుంచి 1977వరకు ఛైర్మన్‌గా కొనసాగారు. 'గ్రేట్ సోషలిస్టు పీపుల్స్ లిబియాన్ అరబ్ జమాహిరియా'కు 'బ్రదర్లీ లీడర్'గా 1977 నుంచి 2011 వరకు కొనసాగారు. నాలుగు దశాబ్దాలపాటు లిబియా రాజకీయాలను శాసించి పాలనలో సంస్కరణలతో ప్రజాదరణ పొందారు. 2011 అక్టోబరు 20న కన్నుమూశారు.

ప్రిన్స్ రోజర్స్ నెల్సన్ (జయంతి)



అమెరికాకు చెందిన సంగీత దర్శకుడు ప్రిన్స్‌గా పేరొందిన ప్రిన్స్ రోజర్స్ నీల్సన్ 1958 జూన్ 7న జన్మించారు. గాయకుడు, గేయ రచయిత, మల్టి ఇన్‌స్ట్రుమెంటలిస్ట్, రికార్డ్ ప్రొడ్యూసర్, నటుడు, డైరెక్టర్‌గా బహుముఖ ప్రజ్ఞాశాలి. ప్రపంచ వ్యాప్తంగా ఫంక్, ఆర్ అండ్ బి, రాక్, న్యూవేవ్, క్లాజికల్, సోల్, సింత్-పాప్, పాప్, జాజ్, హిప్‌హాప్ వంటి సంగీతంలో ఎంతో పేరొందారు. ప్రపంచవ్యాప్తంగా 150 మిలియన్‌లకుపైగా రికార్డులు అమ్ముడయ్యాయి. గ్రామీ ప్రెసిడెంట్స్ మెరిట్ అవార్డు, అకాడమీ అవార్డు, అమెరికన్ మ్యూజిక్ అవార్డ్స్ ఫర్ అచీవ్‌మెంట్ తదితర అవార్డులు పొందారు. 2016 ఏప్రిల్ 21న కన్నుమూశారు.

కదలకుండా కూర్చుంటే అనారోగ్యమే..!

● నిత్యం యోగా చేస్తా : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

బెంగళూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): శారీరక శ్రమ లేకుండా కదలకుండా కూర్చుంటే అనారోగ్యం తప్పదని తాను నిత్యం ప్రాణాయామం, కనీస ఆసనాలు వేస్తానని సీఎం సిద్ధరామయ్య వెల్లడించారు. సచివాలయ అధికారి, సిబ్బందికి విధానసౌధ బ్యాంక్వెట్‌హాల్‌లో గురువారం ఏర్పాటైన ఉచిత ఆరోగ్య పరీక్షా, చికిత్సా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. జీవనశైలి, ఆహారపద్ధతులు ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయన్నారు. రాష్ట్రప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన ఆరోగ్యం, చికిత్సలకోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. కేన్సర్ వంటి ప్రాణాంతక రోగాలను సైతం గుణం చేసే వీలుందన్నారు. నియమిత ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ రావడం ద్వారా దీర్ఘకాల ఆరోగ్యం కాపాడుకోవడం సాధ్యమన్నారు. పూర్వీకుల ఆరోగ్యపద్ధతులు శ్రమతో కూడిన జీవనశైలి వల్ల చక్కటి ఆరోగ్యంతో ఉండేవారన్నారు. ఇటువంటి ఆరోగ్య పరీక్షా శిబిరాలు తరచూ నిర్వహించాలని, రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగించాలని అధికారులకు సూచించారు. వయసుపైబడినవారు ఆరోగ్య సమస్యలను అధిగమించేలా పలు జాగ్రత్తలు పాటించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో మంత్రి దినేశ్ గుండూరావు, రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రజనీశ్ గోయెల్, సీఎం రాజకీయ కార్యదర్శి నసీర్ అహ్మద్, గ్యారెంటీ పథకాల అమలు సమితి అధ్యక్షుడు హెచ్‌ఎం రేవణ్ణ, చీఫ్ విప్ అశోక్‌పట్టణ, అదనపు ముఖ్యకార్యదర్శి శాలిని రజనీశ్ తదితరులు పాల్గొన్నారు.

1987 ఆగస్టు 27న సిగరెట్ మానేశా

సహవాస దోషం కారణంగా అనారోగ్యకారణమైన అలవాట్లు అవుతాయని సీఎం పేర్కొన్నారు. నిత్యం మనం హెచ్చరికతో మనల్ని కాపాడుకోవాల్సి ఉందన్నారు. తనకు మొదట్లో సిగరెట్ తాగే అలవాటు ఉండేదన్నారు. విదేశాలకు వెళ్లిన వేళ స్నేహితులు సిగరెట్ ప్యాక్ ఇచ్చారన్నారు. అయితే తక్కువ అవధిలోనే సిగరెట్ వీడానన్నారు. చివరకు మనసులో కఠిన నిర్ణయం తీసుకుని 1987 ఆగస్టు 27నుంచి సిగరెట్ మానేశానన్నారు.



ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న సీఎం సిద్ధరామయ్య

స్కూల్ బస్సు నడుపుతుండగా డ్రైవర్‌కు గుండెపోటు

● ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత ● విద్యార్థులు సురక్షితం

బెంగళూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను స్కూల్ నుంచి ఇళ్లకు తరలిస్తున్న సమయంలో బస్సు నడుపుతూనే డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఉడుపి జిల్లాలో పేత్రి ప్రాంతానికి చెందిన ఆల్విన్ డిసౌజా చాలాకాలంగా స్కూల్ బస్సు డ్రైవర్‌గా వ్యవహరిస్తున్నారు. పరంపళ్ళి నుంచి మణిపాల్‌కు వెళ్తుండగా డ్రైవర్‌కు గుండెపోటు వచ్చింది. వెంటనే బస్సును రోడ్డుకు పక్కగా ఆపేశారు. అంతలోనే డ్రైవర్ సీట్లోనే కుప్పకూలారు. బస్సులో ఉన్న పాఠశాల సహాయక సిబ్బంది వెంటనే మణిపాల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స ఫలించక కాసేపటికే మృతి చెందారు. బస్సును ఒక్కసారిగా రోడ్డుపక్కన ఆపివేయడంతో పిల్లలకు స్వల్పగాయాలయ్యాయి. తీవ్ర ప్రమాదం జరగక పోవడంతో తల్లి దండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.



ప్రమాదానికి గురైన బస్సు

తల్లిదండ్రుల శ్రమను విద్యార్థులు గుర్తించాలి..

బెంగళూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తారని వారి శ్రమను గుర్తించి గౌరవం ఇవ్వాలని బెంగళూరు దక్షిణ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఏ ఆనందరాజ్ విద్యార్థులకు సూచించారు. నగరంలోని బనశంకరి మూడో స్టేజ్‌లోని ఐటిఐ లే అవుట్‌లోగల శ్రీకృష్ణ పీయూ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సర ప్రథమ పీయూ తరగతులను గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఇదే సందర్భంగా బీబీఏ, బీసీఏ, ద్వితీయ పీయూ ర్యాంకు విజేతలు, ఉన్నతశ్రేణిలో మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలతో సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని ఆనందరాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి జీవనాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యాసంస్థల సంస్థాపకులు డాక్టర్ రుక్మాంగదనాయుడు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రతిభా పురస్కారాల ఆశ్యకతను వివరించారు. తద్వారా ఇతరులు స్ఫూర్తితో మరింత ముందుకు సాగాలన్నదే ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యావిభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ మనోహర్, పీజీ విభాగం ప్రొఫెసర్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ కమలా సుగంధి, మరో విభాగం ప్రిన్సిపాల్ మంజునాథ్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రతిభాపురస్కారాలతో విద్యార్థులు

మల్లేశ్‌బాబు విజయంతో సంబరాలు

బంగారపేట, జూన్ 6: కోలారు లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ, జేడీఎస్ మైత్రి అభ్యర్థి ఎం మల్లేశ్‌బాబు గెలుపు సాధించడంపై విజయోత్సవం నిర్వహించారు. గ్రామంలోని బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహానికి మాలార్పణ చేశారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం బీజేపీ, జేడీఎస్ అనుకూల నినాదాలు చేస్తూ కార్యకర్తలు, అభిమానులు ముందుకు సాగారు. జేడీఎస్ గ్రామీణ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బంగారపేట శాసనసభ నియోజకవర్గంలో రెండుసార్లు ఓడినా మైత్రి అభ్యర్థిగా బరిలోకి దిగడంతో గెలుపు సాధించారన్నారు. విజయోత్సవంలో మమత గణేశ్, రాధమ్మ లక్ష్మీపతి, కృష్ణమూర్తి, కమ్మసంద్ర గ్రామపంచాయతీ ఉపాధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, యోగేశ్, సీ శ్రీనివాస్ అలివేలమ్మ, మోతకపల్లి పరదమగౌడ, సుధాకర్‌రెడ్డి తదిరులు పాల్గొన్నారు.



విజయోత్సవంలో మల్లేశ్‌బాబు తదితరులు





సూక్ష్మానికి మోక్షం కావాలి!

రెండేళ్లు పూర్తిగా బంద్..

మూడేళ్లు అరకొరగా సరఫరా

టీడీపీ హయాంలో 90 శాతం సబ్సిడీ

కూటమి గెలుపుతో రైతుల్లో చిగురించిన ఆశలు

ఐదేళ్లుగా అటకెక్కిన సూక్ష్మసేద్య పథకం

'అనంతపురం జిల్లా నా గుండెల్లో ఉంటుంది. మిమ్మల్ని ఆదుకునే బాధ్యత నాది. అధికారంలోకి రాగానే వైసీపీ ప్రభుత్వం ఎత్తేసిన అన్ని పథకాలను పునరుద్ధరిస్తాం. అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటాం..' అని టీడీపీ అధినేత చంద్రబాబు మాటిచ్చారు. 2014 ఎన్నికల్లో 12 మంది ఎమ్మెల్యేలను ఇచ్చినందుకు అనేక పథకాలతో ఆదుకున్నారు. అంతర్జాతీయ కార్ల తయారీ పరిశ్రమ 'కియ'ను కరువు నేలపైకి తీసుకొచ్చారు. రైతులకు సబ్సిడీ పథకాలు, నిరుద్యోగులకు భృతి, పేదలకు అన్న క్యాంటీన్, ఆపన్నులకు పింఛన్లు, యువతకు ఉద్యోగాలు.. ఇలా ఎన్నెన్నో చేశారు. ఇప్పుడు ఉమ్మడి జిల్లా జనం అంతకు మించి.. మొత్తం 14 మంది ఎమ్మెల్యేలను ఇచ్చారు. వైసీపీకి వాయిస్ లేకుండా చేశారు. ఇక తమ కష్టాలను తీర్చే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు కూడా గతానికి మించి మేలు చేస్తారని ఆశిస్తున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరుతున్న నేపథ్యంలో.. వైసీపీ పాలనలో వివిధ రంగాలు, వివిధ వర్గాలు ఎదుర్కొన్న సంక్షోభం.. చంద్రబాబుపై పెట్టుకున్న ఆశల గురించి ప్రత్యేక కథనాలు.. నేటి నుంచి..!



అనంతపురం అర్బన్/యాడికి, జూన్ 6: సాగునీటి వనరులు నిర్వీర్యమై.. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను సూక్ష్మసేద్య పరికరాలు ఎంతగానో ఆదుకున్నాయి. డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను ఎస్సీ ఎస్టీ రైతులకు ఉచితంగా, మిగిలిన రైతులకు 90 శాతం సబ్సిడీతో టీడీపీ ప్రభుత్వం అందించేది. దీంతో అరకొరగా బోరు నీరున్నా.. వేలాది ఎకరాల్లో ఉద్యాన పంటలను రైతులు సాగు చేసుకోగలిగారు. ఆర్థికంగా నిలదొక్కుకోగలిగారు. కానీ వైసీపీ అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని మొదటి రెండేళ్ల పూర్తిగా అటకెక్కించింది. రైతుల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో సబ్సిడీని 70 శాతానికి కుదించి.. మూడేళ్లపాటు అరకొరగా సరఫరా చేసింది. గత ఆర్థిక సంవత్సరం (2024 మార్చి 31 వరకు) ముగిసే వరకు సూక్ష్మసేద్య పరికరాలు సరఫరా చేయాల్సి ఉండగా.. ఎన్నికల కోడ్ అమలులోకి రాకనే.. జనవరి నుంచే నిలిపేశారు. దీంతో ఉద్యాన రైతులు మార్కెట్‌లో అధిక ధరలకు పరికరాలను కొనుగోలు చేయాల్సి వచ్చింది. కొనలేనివారు సాగుకు దూరమయ్యారు. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో ఇక తమ కష్టాలు తీరుతాయని రైతులు భావిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం ఎత్తేసిన పథకాలన్నింటినీ పునరుద్ధరిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్ హామీ ఇచ్చారు. దీంతో సేద్యానికి మంచి రోజులు వచ్చినట్లేనని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ పాలనలో సరఫరా ఇలా...

సంవత్సరం	రైతుల సంఖ్య	విస్తీర్ణం (హెక్టార్లు)
2019-20	19,276	24,770.72
2020-21	-	-
2021-22	-	-
2022-23	19,045	22,883.45
2023-24	16,630	20,005,31
మొత్తం	54,951	67,659.48

ఎంతో తేడా..

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి జిల్లా ఉద్యాన రైతులకు కష్టాలు మొదలయ్యాయి. 2019-20 సంవత్సరంలో కేవలం 19,276 మంది రైతులకు 24,770.72 హెక్టార్లకు సరిపడా పరికరాలు ఇచ్చారు. ఆ తర్వాత 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో పూర్తిగా నిలిపేశారు. రైతులు, రైతు సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేక రావడంతో 2023-24 సంవత్సరంలో పరికరాల సరఫరాను పునరుద్ధరించారు. కానీ పెద్దగా ప్రయోజనం లేకపోయింది. టీడీపీ హయాంలో 2014-15 నుంచి 2018-19 దాకా ఉమ్మడి జిల్లాలోని 1,07,751 మంది రైతులకు 1,22,864. 24 హెక్టార్లకు సరిపడా సూక్ష్మసేద్య పరికరాలు సరఫరా చేశారు. వైసీపీ పాలనలో కేవలం 54,951 మంది రైతులకు 67,659. 48 హెక్టార్లకు సరిపడా పరికరాలను మాత్రమే ఇచ్చారు.



టీడీపీ హయాంలో ఉమ్మడి జిల్లా రైతులకు అందిన డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు

సంవత్సరం	రైతుల సంఖ్య	విస్తీర్ణం (హెక్టార్లు)
2014-15	7,726	8,355.42
2015-16	21,157	21,687.01
2016-17	22,181	24,637.40
2017-18	29,720	34,814.49
2018-19	26,967	33,369.92
మొత్తం	1,07,751	1,22,864.24





డబ్బులు కట్టినా..

నాలుగు ఎకరాలకు డ్రిప్ పరికరాల కోసం ఏడాది క్రితమే డబ్బులు చెల్లించాను. డ్రిప్ పరికరాలు సరఫరా చేయలేదు. సబ్సిడీపోనూ రూ.35 వేలు కట్టినా అదిగో ఇదిటో అంటూ కాలయాపన చేశారు. డ్రిప్ పరికరాలు ఇవ్వకపోవడంతో పంటలు సాగు చేయకపోయా. టీడీపీ కూటమి ప్రభుత్వం సకాలంలో డ్రిప్ పరికరాలు సరఫరా చేసి మమ్మల్ని ఆదుకోవాలి.

- రాజశేఖర్‌నాయుడు, యాడికి మండలం

సబ్సిడీ కుదించి.. ద్రోహం

టీడీపీ హయాంలో ఉమ్మడి జిల్లాలో సూక్ష్మసేద్య పరికరాలకు ఒక్కో రైతుకు పది ఎకరాల దాకా 90 శాతం సబ్సిడీని వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం ఉచితంగా డ్రిప్ పరికరాలు సరఫరా చేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే సూక్ష్మసేద్య పరికరాల మంజూరుకు గైడ్ లైన్స్‌ను మార్చారు. ఐదెకరాల దాకా 90 శాతం, ఆపైన 70 శాతం సబ్సిడీని వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీని ఎత్తేశారు. ఇతర సామాజికవర్గ రైతుల తరహాలోనే సబ్సిడీ పోను మిగతా డబ్బులు చెల్లించాలని వారికి షరతు పెట్టారు. సూక్ష్మ సేద్యానికి బాగా అలవాటు పడిన రైతులు వైసీపీ ప్రభుత్వ నిర్ణయాల కారణంగా తీవ్రంగా నష్టపోయారు. సబ్సిడీని కుదించినా.. రైతులకు పూర్తి స్థాయిలో సరఫరా చేయలేదు.

చిగురించిన ఆశలు

అధికారం చేపట్టగానే గతంలో మాదిరే సూక్ష్మసేద్య పరికరాలకు 90 శాతం సబ్సిడీని వర్తింపజేస్తామని, రైతులను ఆదుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించింది. చంద్రబాబు మరోమారు ముఖ్యమంత్రి అవుతున్నారు. దీంతో తమకు మంచి రోజులు వచ్చినట్లే అని కరువు జిల్లా రైతాంగం విశ్వాసం వ్యక్తం చేస్తోంది. పాత పద్ధతిలో 90 శాతం సబ్సిడీ ఇస్తారని, ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీని వర్తింపజేస్తారని భావిస్తున్నారు.

వైసీపీ హయాంలో నష్టపోయాం

నాలుగు ఎకరాల్లో డ్రిప్ కోసం ఏడాదిన్నర క్రితమే రూ.42 వేలు చెల్లించాను. అధికారులు, కంపెనీ సిబ్బందిని పలుమార్లు అడిగినా ప్రయోజనం లేకపోయింది. సూక్ష్మసేద్య పరికరాలు ఇస్తే ఖరీఫ్, రబీ సీజన్లల్లో పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. వైసీపీ ప్రభుత్వం ఇవ్వకపోవడంతో ఖరీఫ్ పంటలతోనే సరిపెట్టుకున్నాం. టీడీపీ కూటమి ప్రభుత్వం దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ పరికరాలు సరఫరా చేసి ఆదుకోవాలి.

- మనోహర్ చౌదరి, యాడికి

నట్టేట ముంచారు..

వైసీపీ పాలనలో కరువు రైతులను నట్టేట ముంచారు. వ్యవసాయంలో సూక్ష్మసేద్య పరికరాల ప్రాధాన్యం బాగా పెరిగింది. కానీ వైసీపీ ప్రభుత్వం సబ్సిడీ పథకాన్ని అటకెక్కించి రైతులకు తీరని అన్యాయం చేసింది. గత ఐదేళ్ల పాలనలో రెండేళ్లపాటు పూర్తిగా నిలిపేశారు. రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో ఆ తర్వాత అరకొరగా సరఫరా చేసి చేతులు దులుపుకున్నారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింకర్ల పరికరాలు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటారు.

- బొల్లు శ్రీనివాసరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి

ఇండో పసిఫిక్ ప్రాధాన్యంపై చర్చాగోష్ఠి

బెంగళూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఇండో పసిఫిక్ ప్రాధాన్యంపై రేవా యూనివర్సిటీలో ప్రత్యేక చర్చాగోష్ఠి నిర్వహించారు. ఇండో పసిఫిక్ ప్రాంతం గురించి భారతదేశ నిర్వచనం క్రమంగా పెరుగుతోందని ఫ్రాన్స్, జపాన్ అంగీకరించిందని భారత మాజీ రాయబారి గుర్జిత్‌సింగ్ అభిప్రాయపడ్డారు. శతాబ్దపు ప్రపంచ రాజకీయాలు, సైనిక వ్యవహారాలు, ఆర్థిక వ్యవస్థలో ముఖ్యమైన పాత్రలో ఇండో పసిఫిక్ ప్రాంతం ప్రధానంగా ఉందన్నారు. రేవా విశ్వవిద్యాలయం యొక్క సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ జియో పొలిటిక్ పేరిట ప్రత్యేక కార్యక్రమంలో పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఇండో పసిఫిక్ వ్యూహాలు 2019లో జపాన్, ఆస్ట్రేలియా, ఇండియా, యూఎస్‌లు ప్రకటించాయని అనంతరం ఆసియాన్, ఫ్రాన్స్ ఉన్నాయన్నారు. ఇప్పుడు ఇండో పసిఫిక్ ప్రాంతం సన్నిహితంగా ఉందన్నారు. అయితే ఇండో పసిఫిక్ విధనాన్ని చైనా ఎలా వ్యతిరేకిస్తున్నదో రాయబారి సింగ్ వివరించారు. ఐక్యరాజ్యసమితికి అనుగుణంగా నావిగేషన్, వాణిజ్యం తదితర అంశాలపై వివరించారు.

డాక్టర్ మంజునాథ్ గెలుపుతో .. గుండు కొట్టించుకున్న ముస్లిం అభిమాని



మహదేశ్వర ఆలయం వద్ద గుండుతో యూనిస్‌ఖాన్

బెంగళూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రామీణ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి డాక్టర్ సీఎన్ మంజునాథ్ గెలవాలని కోరుకున్న కనకపుర తాలూకా జేడీఎస్ అభిమాని యూనిస్ అలిఖాన్ గుండు చేయించుకున్నారు. మంజునాథ్ గెలుపు సాధించడంతో గురువారం గ్రామానికి చెందిన మిత్రులతో కలసి చామరాజనగర లోని మలె మహదేశ్వర ఆలయానికి వెళ్లి తలనీలాలు సమర్పించుకున్నారు. కనకపుర తాలూకా ఉయ్యంబళ్ళి హోబళిలోని దొడ్డ కొప్ప గ్రామానికి చెందిన యూనిస్ అలిఖాన్ గుండు కొట్టించుకున్న ఫోటోలు వైరల్ అయ్యాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద అలిఖాన్ మాట్లాడుతూ నేను ముస్లిం అని డాక్టర్ గెలిస్తే మహదేశ్వర కొండకువస్తానని మొక్కుకున్నా అన్నారు. తనకు రాజకీయాలపై ఆసక్తి ఉన్నప్పటి నుంచి జేడీఎస్‌లోనే ఉన్నారు. తాత, తల్లిదండ్రులు జేడీఎస్ సాను భూతిపరులే అన్నానన్నారు. మా పల్లెలో హిందూముస్లిం బేధాభిప్రాయాలు లేవని కలసిమెలసి ఉంటామన్నారు.

ముగిసిన గనుల సర్వే

రాయదుర్గం, జూన్ 6: అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉన్న కర్ణాటక లీజు మైనింగ్ గనుల సర్వే గురువారం నాటితో ముగిసింది. వారంరోజుల పాటు కర్ణాటక, ఆంధ్ర సరిహద్దు ప్రాంతాలలో ఉన్న ఇనుపగనులలో పర్యటించిన కేంద్రబృందం సర్వే ప్రక్రియను పూర్తి చేసి నివేదికను సీఈసీకి సమర్పించనున్నట్లు ముఖ్యంగా కర్ణాటకకు సంబంధించిన టుముటి, విఠలాపురం, బేలూరు గ్రామాల పరిధిలో టీ నారాయణరెడ్డి, మహబూబ్ ట్రేడర్స్, హింద్ ట్రేడర్స్, బళ్లారి మైనింగ్ కంపెనీ, విబూదిగుడ్డ మైనింగ్ కంపెనీ, రత్నమైనింగ్, సుగులమ్మగుడ్డ మైనింగ్ గనుల లీజుల సరిహద్దులను సర్వే చేశారు.